

చిత్తూరులో శుక్రవారం ఉదయం ఎండవేడిమికి తాళలేక మున్సిపల్ పార్కు బస్టాపులో తలదాచుకున్న జనం





చిత్తూరులో వర్షం

# ఎండలు మండేవేళ వానలు కురిశాయి

చిత్తూరు కలెక్టరేట్/యాదమరి/సదుం/పుంగనూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండే వేసవికాలంలో వర్షం కురిసింది.చిత్తూరు నగరంలో ఉదయం సూర్యతాపానికి ప్రజలు అల్లాడిపోయారు.మధ్యాహ్నం పైన ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులతో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభం కావడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అర్ధగంట పాటు కురిసిన వర్షంతో మురుగుకాల్వలు పొంగిపొర్లాయి. ఎమ్మెస్సార్ సర్కిల్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో అత్యధికంగా కుప్పంలో 15 మిమీ, రొంపిచెర్లలో 12.4, పలమనేరులో 11.8, గుడుపల్లెలో 6.4, శాంతిపురంలో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది. వచ్చే రెండ్రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. పుంగనూరులో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.యాదమరి మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు గంటకు పైగా కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సదుంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది.నిలకడగా రెండు గంటలపాటు కురిసిన వర్షం మొత్తం వాతావరణాన్ని చల్లబరిచింది.



పుంగనూరులో వర్షం

## రేపు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఐ రోడ్డులోని రాజమహల్ ఫంక్షన్ హాలులో ఆదివారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం వుంటుందని నిర్వాహకులు డాక్టర్ రోజా ప్రియ, డాక్టర్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024వ సంవత్సరానికి పద్య, వచన, కథ, నవలల పోటీల్లో గెలుపొందిన వారికి నగదు పురస్కారం ఇవ్వడంతో పాటు సత్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 19 మంది రచయితలు, కవులు తమ రచనలు పంపారన్నారు.

## టీచర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్య పాఠశాలల్లో అర్హతగల సెకండరీ గ్రేడ్ లాంగ్వేజ్ పండిట్, పీఈటీల సీనియారిటీ జాబితా డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై తగిన ఆధారాలతో శనివారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు అభ్యంతరాలను డీఈవో కార్యాలయంలో స్వీకరిస్తారన్నారు. గడువు ముగిశాక వచ్చిన అభ్యంతరాలను స్వీకరించరని డీఈవో పేర్కొన్నారు.

## ప్రజలకు, పార్టీకి ఉపయోగపడేవారికే పదవులు





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

- కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు
- నేటి సాయంత్రం మరోసారి సమావేశం

కుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అటు ప్రజలకు, ఇటు పార్టీకి ఉపయోగపడేవాడే నాయకుడని, అటువంటివారికే పదవులు లభిస్తాయని ముఖ్యమంత్రి,టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తేల్చి చెప్పారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీతోపాటు మరికొందరు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాత్రి బాగా పొద్దుపోయే దాకా ఈ సమావేశం జరిగింది.పార్టీ వర్గాలనుంచి ప్రాథమికంగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు...కుప్పం నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై ఈ సమావేశంలో చంద్రబాబు చర్చించారు. ఎనిమిది నెలల పాలనపై ప్రజాభిప్రాయం గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. నాయకుల పనితీరుపై వచ్చిన ప్రాథమిక సర్వేను వెల్లడించి, పనితీరును మెరుగు పరచుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కుప్పం నియోజవకవర్గంలో టీడీపీ నాయకులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం నుంచి యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిల దాకా వారివారి పనితీరుపై ఐవీఆర్ఎస్ వాయిస్ మెసేజీల ద్వారా కార్యకర్తలనుంచి అభిప్రాయాన్ని పార్టీ సేకరిస్తున్న విషయం చర్చలోకి వచ్చింది. కుప్పం నియోజకవర్గంలో పార్టీని కిందిస్థాయినుంచి ప్రక్షాళన చేసి పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరాన్ని చంద్రబాబు నొక్కి చెప్పారు. నామినేటెడ్ పదవులకోసం ఇప్పటికే పార్టీ వద్దకు చేరిన దరఖాస్తుల గురించి ప్రస్తావన వచ్చింది. తనచుట్టూ తిరుగుతూ, షో చేయడం కాకుండా కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిజంగా కష్టపడిన వారికి తప్పకుండా పదవులు వస్తాయని చంద్రబాబు స్పష్టం చేశారు.శనివారం సాయంత్రం మరోసారి కుప్పం సమన్వయకమిటీ సభ్యులతో చంద్రబాబు భేటీ కానున్నారు. అంతకుముందు పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉదయంనుంచి సాయంత్రం దాకా విజన్- 2047 డాక్యుమెంట్‌పై కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీతోపాటు ముఖ్య నాయకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. పేదరికంలేని రాష్ట్రంగా ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, అలాగే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించడానికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని వర్క్‌షాప్‌లో నాయకులకు బోధించారు. ఈ లక్ష్యాల సాధనకు నాయకులు సానుకూల దృక్పథంతో పనిచేయడమేకాక, పార్టీ శ్రేణులన్నింటినీ ఆ దిశగా ముందుకు నడిపించాలని ఉద్బోధించారు. చేసే పని ఏదైనా ప్రజల మన్ననలు పొందేలా ఉండాలని చెప్పారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, నాలుగు మండలాలు, కుప్పం మున్సిపాలిటీ పార్టీ విభాగాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.ఎమ్మెల్సీ డాక్టర్ చిరంజీవులు, పేరాబత్తుల రాజశేఖర్, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, నక్కా ఆనందబాబు వర్క్‌షాప్‌లో శిక్షణ ఇచ్చారు.

## డీసీసీబీకి రూ.12.77కోట్ల లాభం

- రూ.3435.35 కోట్ల వ్యాపారంతో రాష్ట్రంలో ఏడవ స్థానం
- చిట్టచివరి దశలో విండోల కంప్యూటరీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో వందేళ్ళకు మించి చరిత్ర కలిగిన బ్యాంకుల్లో డీసీసీబీ ఒకటి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏటా సేవలు విస్తృతం చేస్తూ వివిధ పథకాలు ప్రవేశపెడుతూ టర్నోవర్ పెంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఆర్థిక సంవత్సరం ముగియడంతో 2023-24 సంవత్సరంలో బ్యాంకు సాధించిన అభివృద్ధి వివరాలను సీఈవో శంకర్ బాబు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఎక్కువ వ్యాపారం చేసి డీసీసీబీ మంచి లాభాలు గడించింది. జిల్లాలో పలు సింగిల్ విండోలు (వ్యవసాయ సహకార పరపతి సంఘాలు) గణనీయ వృద్ధి సాధించాయి. డిపాజిట్లను గత ఏడాది కంటే ఎక్కువ సేకరించింది.వివిధ రకాల సేవలందిస్తూ రూ.3435.35 కోట్ల వ్యాపారంతో రాష్ట్రస్థాయిలో ఏడో స్థానంలో నిలిచింది. రూ.12.77 కోట్ల లాభం గడిచింది. అయితే గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.1.13 కోట్ల లాభం తగ్గింది. బ్యాంకు పరిధిలో 75 సహకార సంఘాలుండగా, 67 విండోల కంప్యూటరీకరణ పూర్తయ్యింది.మిగిలిన విండోల్లో కూడా కంప్యూటరీకరణ ఈ వారంలో పూర్తి కానుంది. ఇది పూర్తయితే అన్ని సింగిల్ విండోల్లో బ్యాంకింగ్ తరహా సేవలు అందుబాటులోకి వస్తాయి.రూ.760 కోట్ల లక్ష్యంలో రూ.676 కోట్లు రికవరీ చేసింది.రూ.874కోట్ల మేర బంగారంపై రుణాలు ఇచ్చింది. స్వయంసహాయక గ్రూపులకు గత ఏడాది రూ.170 కోట్లు పంపిణీ చేయగా, కొత్త ఏడాదిలో రూ.200 కోట్లు ఇవ్వాలని బ్యాంకు పాలకవర్గం నిర్ణయించింది.

### విండోలకు 1.50 శాతం డివిడెండ్



గత ఏడాది బ్యాంకు సాధించిన లాభాల నుంచి 1.5 శాతం డివిడెండ్ ఇచ్చాం. ఈ ఏడాది స్టాచుటరి ఆడిట్ పూర్తికాగానే వచ్చే లాభాలను పరిగణనలోకి తీసుకుని డివిడెండు ప్రకటిస్తాం. గత ఏడాదితో పోలిస్తే షేర్ కేపిటల్ రూ.1.96 కోట్లు, డిపాజిట్లు రూ.66.70 కోట్లు అదనంగా సేకరించాం. డిపాజిట్లతో పాటు ప్రజలను ఆదుకునే దిశలో రుణాలు, అడ్వాన్స్‌లు రూపేణ రూ.434.26 కోట్లు అదనంగా ఇచ్చాం. 2023-24లో స్థూల లాభం రూ.14.90 కోట్లు రాగా, 2024-25లో లాభం తగ్గి రూ.12.77 కోట్లు మాత్రమే వచ్చాయి.

- సి. శంకరబాబు,డీసీసీబీ సీఈవో

## కొనసాగుతున్న 'టెన్త్' మూల్యాంకనం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైన టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం రెండో రోజైన శుక్రవారం కూడా ప్రశాంతంగా కొనసాగిందని డీఈవో వరలక్ష్మి తెలిపారు. అన్ని సబ్జెక్టులకు అవసరమైన సిబ్బందిని నియమించామని, ఎక్కడా ఇబ్బందులు, పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీవీఈవో

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్య, నోట్ పుస్తకాలను ఉచితంగా అందిస్తోంది. వీటిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి బాలికల జూనియర్ కళాశాలలో డీవీఈవో సయ్యద్ మౌల విద్యార్థినులకు అందించారు.ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎనిమిది కేజీబీవీలు, 28 హైస్కూల్ ప్లస్‌లు, ఏడు మోడల్స్ స్కూల్స్‌లోని 5464 మంది విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకోసం 11,382 పాఠ్యపుస్తకాలు, 25,698 రూల్ నోట్, 25,698 అన్‌రూల్డ్ నోట్ పుస్తకాలు జిల్లాకు వచ్చాయన్నారు. ప్రతి సైన్స్ విద్యార్థికి పాఠ్యపుస్తకాలపాటు రూల్డ్, అన్‌రూల్డ్ 12 నోట్ పుస్తకాలు, ఆర్ట్స్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు రూల్డ్, అన్‌రూల్డ్ 10 నోట్ పుస్తకాలు ఉచితంగా ఇస్తామని వివరించారు. ఈనెల 23వ తేదీ వరకు తరగతులు ఉంటాయని, ఆపై వేసవి సెలవులయ్యాక జూనియర్ కళాశాలలు పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు.

## 7నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-2 (వార్షిక) పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తొమ్మిదో తరగతికి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రశ్నపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్‌లో, ఆరు నుంచి తొమ్మిది వరకు సంబంధించినవి మండల వనరుల కేంద్రంలో భద్రపరచనున్నారు. పరీక్షల అనంతరం 17న జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేయాలి. 21 నుంచి 23వ తేదీవరకు విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ప్రమోషన్ జాబితా అందజేస్తారు.

### పరీక్షల షెడ్యూల్ ఇలా..

ఒకటి నుంచి ఐదు తరగతులకు 9న తెలుగు, 10న ఇంగ్లీష్, 11న మ్యాథ్స్, 12న ఈవీఎస్, 15న ఓఎస్ఎస్‌సీ నిర్వహించనున్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు 7న తెలుగు, 8 హిందీ, 9న థర్డ్ లాంగ్వేజ్, 10న మ్యాథ్స్, 11న జనరల్, ఫిజికల్ సైన్స్, 12న ఫిజికల్ సైన్స్, 15న సోషల్ స్టడీస్, 16న కాంపోజిట్ కోర్సు పేపర్-1, 17న కాంపోజిట్ కోర్స్-2 పరీక్షలను నిర్వహించనున్నారు.

## మందుగుండు పేలి ఏనుగు కాలికి గాయం

- కారకులను అదుపులో తీసుకున్న అటవీశాఖ?

యాదమరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నాటు మందుగుండు పేలడంతో యాదమరి, బంగారుపాళ్యం సరిహద్దుల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపులో ఒక ఏనుగుకు కాలికి గాయమైంది. మూడు నెలలుగా యాదమరి, బంగారుపాళ్యం సరిహద్దుల్లో ఉన్న ఏనుగుల గుంపు.. అటవీ సమీప గ్రామాల పంటలపై దాడులతో హడలెత్తించాయి. గురువారం కుప్పం నుంచి అదనంగా వచ్చిన సిబ్బందితో కలిసి అటవీశాఖ అధికారులు సమన్వయం చేసుకుని ఏనుగుల మందను బోడబండ్ల బీట్ పరిధిలోకి మళ్లించారు. ఈ క్రమంలో అడవి పందులను వేటాడేందుకు ఉపయోగించే నాటుమందు గుండు పేలడంతో ఓ ఏనుగు గాయపడినట్లు గుర్తించారు. అనంతరం యాదమరి, బంగారుపాళ్యం అటవీ సరిహద్దుల్లో వేటకు పాల్పడేవారిని గుర్తించారు. వీరిలో ఈ పని చేశారన్న అనుమానం ఉన్నవారిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## తాగునీటి ఎద్దడి మొదలైంది



కె.రామాపురంలో ట్యాంకరు ద్వారా తాగునీటి సరఫరా

కుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి అప్పుడే మొదలైంది. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాను ప్రారంభించాల్సిన పరిస్థితి నెలకొంది.ఒకవైపు అధికార యంత్రాంగం తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఉన్న బోర్లలో నీటిమట్టం పడిపోతోంది. మరికొన్ని బోర్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఎంత వేగంగా చర్యలు తీసుకుంటున్నా, దాని కన్నా వేగంగా తాగునీటి ఎద్దడి ముంచుకొచ్చేస్తోంది. కుప్పం మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కొత్తూరు రామాపురంలో ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో శుక్రవారం పంచాయతీ వారు ట్యాంకర్ల ద్వారా ఆ గ్రామానికి తాగునీటిని సరఫరా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అధికారులు తమ దాహార్తి తీర్చడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినందుకు ప్రజలతోపాటు స్థానిక టీడీపీ అధ్యక్షుడు మునిరత్నం, బూత్ ఇన్‌చార్జి బీరప్ప, బీఎల్‌ఏ రామప్ప తదితరులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.



ఆలయం ముందు పూజాహెగ్డే

## తిరుమలేశుని సేవలో బుట్టబొమ్మ

హీరోయిన్ పూజా హెగ్డే శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో ఆమె కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత పూజా హెగ్డే ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. మే 1వ తేదీన తన 'రెట్రో' చిత్రం విడుదల కానుందని తెలిపారు.

**- తిరుమల, ఆంధ్రజ్యోతి**

## టీటీడీకి విరాళంగా మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు

టీటీడీకి శుక్రవారం రెండు మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు విరాళంగా అందాయి. అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు వీలుగా బెంగళూరులోని ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ అనే భక్తుడు రూ.45 లక్షల విలువైన రెండు అశోక్ లేల్యాండ్ బడాదోస్త్ మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లను అందజేశారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో క్యూలైన్ వెంబడి ప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఈ వ్యాన్లు ఉపయుక్తంగా ఉంటాయని వెంకయ్య చౌదరి తెలిపారు. వాహనంలో ఒకేసారి మూడు వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌ఛార్జ్ డీఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**- తిరుమల, ఆంధ్రజ్యోతి**




## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.4.51 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,864**

**తలనీలాలు సమర్పించినవారు: 25,784**





# నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ

- అన్ని వయస్సుల వారూ కంప్యూటర్ నేర్చుకునే అవకాశం
- తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం





నేను తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో పని చేస్తున్నాను. నాకు ఉద్యోగంలో కంప్యూటర్ నాలెడ్జ్ అవసరం. ఇక్కడ నేర్పిస్తున్నారని తెలిసింది. శిక్షణ తీసుకుంటున్నాను. దీని వల్ల నాకు ఉద్యోగంలో ఎంతో ఉపయోగం అవుతుంది.

**- నాగమణి బాయి**



నేను ఆర్టీసీలో రిటైర య్యాను. నేను ఉద్యోగం చేసే సమయంలో కంప్యూటర్ అవసరం పెద్దగా పడలేదు. ఇప్పుడు కంప్యూటర్ అన్ని చోట్లా అవసరం అయి పోయింది.నాకూ నేర్చుకోవాలనిపించింది. నేను నేర్చుకుంటే నా మనవళ్లు, మనవరాళ్లకు నేర్పించగలను.

**- రెడ్డప్ప**



తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నిత్యజీవితంలో కంప్యూటర్ ఒక భాగంగా అమరిపోయింది. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో ఒక అవసరంగా మారిపోయింది. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం వెనుకబాటుతనంగా ఆత్మన్యూనతను పెంచుతోంది. ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని కీబోర్డు మీద టకటకలాడించే పిల్లలకూ, వంటావార్పూ పనుల్లో సతమతమయ్యే పెద్దలకూ నడుమ కనిపించని అగాథం పెరుగుతోంది. సర్వ ప్రపంచాన్నీ, సకల సమాచారాన్నీ తనలో ఇముడ్చుకున్న ఆ బుల్లిపెట్టెకు దగ్గర కావడం ఎలాగో తెలీక చాలా మంది అవస్థ పడుతుంటారు. కిరాణా దుకాణాల మొదలు, బట్టల షాపుల దాకా ఎక్కడ పనికోసం వెళ్లినా.. కంప్యూటర్ వచ్చా అని అడుగుతారు. దీంతో చిన్న చిన్న చదువుల దగ్గర ఆగిపోయినవారు అవస్థ పడుతుంటారు. ఇటువంటి వారి కోసమే తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం ఒక వినూత్న ప్రయత్నం ప్రారంభించింది. వేసవిలో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఎవరైనా ఇక్కడ కంప్యూటర్ శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్‌పై అవగాహన కలిగించడం, అవసరాన్ని బట్టి తగిన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వీరి ఉద్దేశ్యం. సన్నాబన్నా ప్రజలకు ఇదో మంచి అవకాశం.



నేను పదో తరగతి పరీక్షలు పూర్తి చేశాను. ఇంట్లో ఖాళీగా ఉండడం కంటే కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం మేలు. బయట చూసిన సెంటర్ల కంటే ఇక్కడ కంప్యూటర్లు చాలా ఉన్నాయి. శిక్షణ చాలా బాగుంది. ఇంటర్‌లో చేరేటప్పటికే బేసిక్స్ నేర్చుకునేందుకు నాకు వీలు కలుగుతోంది.

**- కావ్య**

**అర్హత:** 7వ తరగతి దాకా చదువుకుని ఉంటే చాలు

**కోర్సులు:** ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ , ట్యాలీ

**తరగతులు:** ఉదయం 8గంటలకు ట్యాలీపై శిక్షణ. సాయంత్రం కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం

**బ్యాచ్‌లు:** ఉదయం 8 నుంచి ఒక బ్యాచ్. సాయంత్రం 4 నుంచి 6 దాకా ఒక బ్యాచ్. 6 నుంచి రాత్రి 8 దాకా ఒక బ్యాచ్.

**వయసు:** ఏ వయసు వారికైనా శిక్షణ ఇస్తారు.

**వివరాలకు:** 99665 84759, 89850 80370

మార్చి 30న లాంఛనంగా తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ నెల 2 నుంచీ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ప్రారంభించారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నవారూ, పేద విద్యార్థులు, గృహిణులు, రిటైరైన ఉద్యోగులు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం 25 కంప్యూటర్లు ఉన్నాయి. వీటి సంఖ్యను మరింత పెంచే ఆలోచనలో ఉన్నారు. పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారి కంప్యూటర్ గురించి తెలుసుకుంటున్నారు.



నేనేమీ ఉద్యోగం చేయడం లేదు కానీ ఎక్కడ చూసినా కంప్యూటర్‌లే ఉంటున్నాయి. నాకూ వాటి గురించి తెలుసుకోవాలనిపించింది. వేమన విజ్ఞాన కేంద్రంలో నేర్పిస్తారని తెలిసి వస్తున్నాను. నేను నేర్చుకోవడం నా పిల్లలకు కూడా ఉపయోగపడుతుంది.

**- నాగమణి**



### చాలా ఉపయోగకరం



వేమన విజ్ఞాన కేంద్రం చేస్తున్న అనేక కార్యక్రమాల్లో కంప్యూటర్ శిక్షణ కూడా ఒకటి. మరికొన్ని రోజుల్లో మరిన్ని శిక్షణలను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం 25 కంప్యూటర్లతో ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కావాలంటూ భిన్న వర్గాల వారు వస్తున్నారు. ఈ శిక్షణను నిరుద్యోగులు, విద్యార్థులు బాగా ఉపయోగించుకోవచ్చు. గృహిణులు, పెద్దవారికి కంప్యూటర్‌పై అవగాహన కలుగుతుంది. వారి ఆసక్తినిబట్టి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఇంట్లో నుంచీ డబ్బులు సంపాదించే అవకాశాలు ఉన్నాయి.

**- పంచముఖేశ్వరరావు, కేంద్రం ఇన్‌చార్జి**

## తిరుపతి- పళణి బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- పళణి బస్సు శుక్రవారం రాత్రి బయలు దేరింది. ఈ సర్వీసును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం అమరావతిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఆ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరింది. కృష్ణగిరి, పళణికి 15మంది ప్రయాణికులు ఎక్కారు. రోజూ రాత్రి 8 గంటలకు మొదలై చిత్తూరు, పలమనేరు, కుప్పం, కృష్ణగిరి, ధర్మగిరి, భవాని, ఈరోడ్ మీదుగా పళణికి మరుసటి రోజు ఉదయం 7గంటలకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రోజూ రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి వవస్తుంది. పెద్దలకు రూ.680, పిల్లలకు రూ.360 చార్జీ. రిజర్వేషన్ సౌకర్యం ఉంది.

## తిరుపతి- కాట్పాడి మధ్య ఆరు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కాట్పాడి మధ్య 5 నుంచి 22వ తేదీ వరకు ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు జోనల్ డిప్యూటీ సీపీఎం మణికుమార్ శుక్రవారం తెలిపారు. రామాపురం రైల్వేస్టేషన్ యార్డు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి బ్రిడ్జి పనులు చేపడుతుండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. విల్లుపురం-తిరుపతి మధ్య నడుస్తున్న (16854) ప్యాసింజరు రైలు కాట్పాడి-తిరుపతి మధ్య ఈ నెల 6, 8, 9, 10, 13, 15, 16, 17, 20, 22 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉమ్మడి జిల్లాను సారా రహితంగా మార్చాలి

- ఎక్సైజ్ అధికారుల సమావేశంలో డైరెక్టర్ నిశాంత్‌కుమార్



జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాను సారా రహితంగా మార్చాలని అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులు చాలా కీలక పాత్ర పోషించాలని సూచించారు. నవోదయం-2 అమలుపై శుక్రవారం ఆయన తిరుపతిలో అధికారులతో సమావేశమయ్యారు. సారా చుక్క కనిపించకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలపైనా ఉక్కుపాదం మోపాలన్నారు. మళ్లీ మళ్లీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, కల్తీ మద్యంపై రావడంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. దీనిపై రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠంగా నిఘా ఉంచాలన్నారు. హరియాణా మద్యం పట్టుకుని నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాస్, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసాచ్చారి, బాలకృష్ణన్ తదితరులున్నారు. అంతకుముందు ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

# ఉపాధి బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ

- ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకం
- టీఏతో పాటు ఇద్దరు ఎఫ్ఏల తొలగింపు
- వెంకటరెడ్డిపాళెం ఎఫ్ఏపై పోలీసు కేసు



ఉపాధి పనుల వివరాలను వెల్లడిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పక్కన ఎంపీడీవో విజయలక్ష్మి

ఓజిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల కోసం ఎంపీడీవో సంతకాన్నే ఫోర్జరీ చేశారు. అవకతవకలు బయటపడతాయని మస్టర్లు, ఎంబుక్‌లు దాచిపెట్టారు. ఓజిలి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పనుల వివరాలను పీడీ శ్రీనిస్‌ప్రసాద్ వెల్లడించారు. రూ.14.94 కోట్లతో 4లక్షల 36వేల 52 పనిదినాలు కల్పించామని, ఇందులో రూ.14 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. పనుల్లో అవకతవకలకు సంబంధించి రూ.1.59 లక్షల జరిమానా విధించామని, రూ.357892 రికవరీకి ఆదేశించామన్నారు. ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ చేశారని, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్ తన అక్రమాలు బయటపడతాయన్న కారణంగా మస్టర్లు, ఎంబుక్ దాచి పెట్టారని తెలిపారు. ఆరిమేనిపాడు, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు పీడీ తెలిపారు. వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్‌పై పోలీసు కేసు నమోదు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించామన్నారు. జిల్లాలో ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో ఉపాధి సిబ్బంది పనితీరు అత్యంత అధ్వానంగా ఉందన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి ప్రక్షాళన చేపట్టనున్నట్లు చెప్పారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, అదే సమయంలో ఉపాధి కూలీలు చైతన్యంతో ఉండాలన్నారు. పని చేసే ప్రాంతంలోనే మస్టర్లు ఉండాలని, పని పూర్తయిన వెంటనే మస్టర్లు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీడీ ప్రేమకుమార్, ఏపీవోలు చిన్నయ్య, ఉషారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి ఐఐటీలో విద్యార్థులకు, స్టాఫ్‌కు మెరిట్ అవార్డులు



బాలసాయి కృష్ణ - కె.వెంకటశ్రీకృష్ణ - దివ్యంత్ అనంత్ - పలక్ ఖండేల్వాల్ - దీపశిఖ - వీరైన్ సూద్ - ఎం.డెనీకుమార్‌రెడ్డి - ఎ.కృష్ణపాండే - ఎం.మేఘవర్షిణి - కె.ఈశ్వర్ వెంకటసాయి వర్మ



అరవింద్ శ్రీనివాసన్ - సుధాకర్ వెంకటాచలం - శృతి షాజీ - టి.ఆదిత్యన్ - సిద్ధార్థ్ చనం - రాజ్రీత సమంత - బి.రాజేష్‌రెడ్డి - ఒ.జ్యోత్స్న - ఎన్.యమున - పృథ్వీ



రితిక్ మండల్ - ఆకాష్ యూనియల్ - జోదీప్ రాయ్ - అనన్య మండల్ - స్టాఫ్.. ఆర్.రమేష్ - వై.విజయ్ - టి.సెంథిల్ - మహ్మద్ ఇషాక్ అలీఖాన్




తిరుపతి ఐఐటీలో శుక్రవారం చీఫ్‌గెస్ట్ ఆర్వీ చక్రపాణి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ నుంచి మెరిట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థి శ్రీకృష్ణ మధుసూదన్

## కాన్పుకోసం భార్యను తీసుకొచ్చి..!

- మద్యం తాగిన భర్త
- మందలించడంతో గొంతు కోసుకున్న వైనం



చికిత్స పొందుతున్న వెంకట కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం ఆమె.. బ్లేడుతో గొంతు కోసుకోవడంతో అతడు.. ఇలా భార్యాభర్తలిద్దరూ ఒకే ఆస్పత్రిలో చేరారు. మద్యం ఎందుకు తాగావంటూ ఆమె మందలించడంతో అతడు గొంతుకోసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం మండలం తొండంబట్టు ఎంజీనగర్‌కి చెందిన వెంకటకృష్ణారెడ్డి.. ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. ఇదే గ్రామానికి చెందిన, శ్రీసిటీలో పనిచేసే పావనిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆరేళ్ల కిందట వారికి కుమారుడు పుట్టాడు. ఆ తర్వాత వెంకటకృష్ణారెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఆ తర్వాత నాలుగుసార్లు ఆమెకు గర్భస్రావం అయింది. ఇప్పుడు తొమ్మిది నెలల గర్భిణి. కాన్పుకోసం శ్రీకాళహస్తికి తీసుకొచ్చిన అతడు.బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో వెళ్లి మద్యం తాగొచ్చాడు.ఇప్పటికి నాలుగుసార్లు అబార్షన్లు అయినా ఇంకా బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలాగంటూ పావని గట్టిగా మందలించింది. రోడ్డుపైనే అతడు ఆవేశంతో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు భార్యాభర్తలను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఆస్పత్రిలో అతడు చికిత్స పొందుతుండగా, ఆమె కాన్పు కోసం ఇక్కడే చేరారు.



బిగించని మోటార్లు

# మోటారు బిగించాలంటే ఆమె అనుమతి కావాలట!

● కార్పొరేషన్ అధికారుల నిస్సహాయత

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకూడదు.అవసరమైన చోట్ల అదనపు ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోండి. మరమ్మతుకు గురైన బోర్లను తక్షణం రిపేరు చేయించండి..... ఇదీ ఎమ్మెల్యే జగన్మోహన్ నగరపాలక అధికారులకు ఇచ్చిన ఆదేశం. అయితే 15వ డివిజన్‌లోని వళ్లియప్పనగర్‌లో 15 రోజుల కిందట బోరు మోటారు చెడిపోయింది. ఇంజనీరింగ్ అధికారులు రిపేరు చేయడానికి బయటికి తీశారు. బోరులోని పైపులను బయటికి తీసి వారం గడిచినా తిరిగి బిగించకపోవడంతో కాలనీ మహిళలు కొంత మంది అధికార పార్టీ స్థానిక నాయకురాలి వద్దకు వెళ్లి సమస్యను వివరించారు.ఒకరిద్దరూ కాకుండా కాలనీలో ఉండే వారంతా తనను అడగాలని, అప్పుడే మోటారు బిగిస్తామని ఆమె తెగేసి చెప్పారు. దాంతో వారంతా నగరపాలక అధికారులకు మొరపెట్టుకున్నారు. అధికారులు కూడా ఆమె చెబితేనే బిగిస్తామని సెలవిచ్చారు.ఎండాకాలం కావడంతో నీటి అవసరం పెరిగింది. మోటారు చెడిపోయినప్పటి నుంచి మూడు రోజులకు ఒక ట్యాంకరు వస్తోందని, ఆ నీళ్లు తమ అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

### వరసిద్ధుడి ఆలయ ధర్మకర్తల మండలి

## రాజీనామా ఆమోదం

చిత్తూరు(గాంధీసర్కిల్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయ ధర్మకర్తల మండలి రాజీనామా ఆమోదిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో 2023 అక్టోబరులో ఆలయ ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. చైర్మన్‌గా అగరంపల్లెకు చెందిన మోహన్‌రెడ్డిని నియమించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైంది. దీంతో మోహన్‌రెడ్డితోపాటు 14మంది ధర్మకర్తల మండలి సభ్యులు రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాలను దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపారు. చాలాకాలంగా వీరి రాజీనామా ఆమోదానికి నోచుకోలేదు. తాజాగా ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో నియమించిన మండలి సభ్యుల రాజీనామాను ఆమోదించారు. ఈ నిర్ణయంతో కాణిపాకం ఆలయానికి కొత్త మండలిని ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అయింది.

## వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల (కాణిపాకం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ దర్శన ఏర్పాట్లను చేశారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పి.కొత్తకోట వెటర్నరీ అసిస్టెంట్ తిరుపతికి బదిలీ

చిత్తూరు(గాంధీసర్కిల్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.శివనాగరాజును డిప్యుటేషన్‌పై తిరుపతి శ్రీవేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయానికి బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి. డాక్టర్ శివనాగరాజు తిరుపతిలో ఏడాదిపాటు విధులు నిర్వర్తించనున్నారు.

## మబ్బుల నడుమ సూరీడు



చిత్తూరు నగర శివారు ప్రాంతమైన ఎస్టేట్‌లో శుక్రవారం సాయంత్రం కనిపించిన సుందర దృశ్యమిది. ఉదయం ఎండ జనాన్ని బయటికి రాకుండా చేసినా.. సాయంత్రం వర్షం కురిసి కొంతమేర వాతావరణం చల్లబడింది.సాయంసంధ్యవేళ మబ్బుల నడుమ సూర్యుడు అస్తమిస్తున్న ఈ దృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

# కోర్ బ్రాంచిలే అసలైన ఆవిష్కరణకు పునాదులు

ఐఐటీ దశమ వార్షికోత్సవ సభలో ఆర్వీ చక్రపాణి




తిరుపతి(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అసలైన ఆవిష్కరణకు పునాదులు ఇంజినీరింగ్‌లోని కోర్ బ్రాంచ్ లేనని ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ చక్రపాణి స్పష్టంచేశారు. తిరుపతి ఐఐటీ 10వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ విభాగాల్లో చేరేందుకు పోటీ పడుతున్నారని, ఐతే ఇంజినీరంగ్‌లో కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిలు లేకుండా ఏఐ, డేటాసైన్స్ మనలేవన్నారు. అందుకని ఏఐ, డేటా సైన్స్ తీసుకున్నప్పటికీ కోర్ బ్రాంచిల్లో బేసిక్స్‌పై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే సాంకేతికంగా మంచి ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచిలకంటే ఏఐ, డేటాసైన్స్ వారికే ప్యాకేజి అధికంగా ఉంటోందని, అయితే, రానున్న నాలుగేళ్లలో ఇంజినీరింగ్ రంగంలో పెనుమార్పులు జరిగి కోర్ బ్రాంచిలకు డిమాండ్ బాగా పెరుగుతుందని చెప్పారు. దీనికిగాను దేశంలోని అన్ని ఐఐటీలను కలుపుకొని ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన వర్క్‌షాప్‌ను తిరుపతి ఐఐటీలోనూ త్వరలో నిర్వహిస్తామన్నారు.

**విజనరీ ముఖ్యమంత్రి టెక్ సేవీ :** దీనికిముందు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. పదేళ్లకాలంలో తిరుపతి ఐఐటీ ఒక్కొక్కటిగా అనేక మైలురాళ్లను అధిగమించిందంటూ వివరించారు. దీనికి చెన్నై ఐఐటీ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరించాయన్నారు. చంద్రబాబు నాయుడిని విజనరీ ముఖ్యమంత్రిగా, టెక్ సేవీగా ఆయన అభివర్ణించారు. ఆయన నేతృత్వంలో మన ఐఐటీ మరిన్ని ఆవిష్కరణలు చేస్తుందన్నారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తిరుపతి ఐఐటీ కూడా ఒక కీలక భాగస్వామిగా ఉందన్నారు. హబ్ ద్వారా సాంకేతిక పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఐఐటీ మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తుందన్నారు. వచ్చే నెలలో తిరుపతి ఐఐటీని సీఎం చంద్రబాబు సందర్శించనున్నారని, అప్పుడు భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తామన్నారు.

### అవార్డుల ప్రదానం

బీటెక్‌లో ఓవరాల్‌గా ప్రతిభ చూపి, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు. అలాగే సిబ్బందికి స్టాఫ్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. తిరుపతి ఐఐటీ అభివృద్ధికి పాటుపడినందుకుగాను సిబ్బంది రమేష్ (ఏఆర్), విజయ్ (సెక్షన్ ఆఫీసర్), ఇషాక్ అలీఖాన్ (జేటీఎస్), సెంథిల్ (సీనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్)కు అవార్డులు లభించాయి.

# గత డీసీసీబీ పాలకవర్గంపై కఠిన చర్యలు తీసుకోండి

వైసీపీ వారికి ఉపయోగపడేలా రుణాలిచ్చి బ్యాంకుకు తీవ్ర నష్టం కల్గించారు

విచారణాధికారికి వివరాలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల కాలంలో గత డీసీసీబీ పాలకవర్గం తప్పుడు మార్గాలతో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఉపయోగపడేలా రుణాలిచ్చి బ్యాంకును తీవ్ర నష్టం కల్గించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోండి' అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అభ్యర్థించారు. డీసీసీబీలో జరిగిన అవకతవకలపై బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణంలో డీఆర్వో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో సహకార చట్టం - 51 సెక్షన్ మేర విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆయన మాటల్లోనే.. 'గత పాలకవర్గం రిజిస్టర్ కాని వాల్యువర్‌తో వేల్యూస్ వేయించి, ఫేక్ ఇన్కం ట్యాక్స్ రిటర్న్స్ ప్రొడ్యూస్ చేసి, వ్యాపారాలు చేయనివారికి క్యాష్ క్రెడిట్ రుణాలు, రీపేమెంట్ కెపాసిటీ లేనివారికి హౌస్ మార్ట్‌గేజ్, హౌస్ కన్‌స్ట్రక్షన్లకు విచ్చలవిడిగా రుణాలు మంజూరు చేశారు. పలమనేరు బ్రాంచ్ పరిధిలో పలువురికి వ్యవసాయ రుణాలను పాలసీలకు విరుద్ధంగా ఇచ్చారు. పార్టీ ప్రాతిపదికన వి.కోట బ్రాంచ్‌లో ఒకే కుటుంబంలోని సభ్యులకు దాదాపు రూ.2కోట్ల రుణాలు ఇచ్చేశారు. జనవరి 2020 నుంచి ఎటువంటి మార్గదర్శకాలు పాటించకుండా బోగస్ జాయింట్ లయబిలిటీ గ్రూప్స్ రుణాలు, బైరెడ్డిపల్లె సంఘం, బ్రాంచ్ ద్వారా అప్పటి పాలకవర్గ చైర్‌పర్సన్, బోర్డు సభ్యులు, వారి అనుయాయులకు సుమారు రూ.7.67 కోట్లు ఇచ్చి బ్యాంకుకు తీవ్ర నష్టం కలిగించారు. ఏటీఎం లోడింగ్‌లో సుమారు రూ.20 లక్షలు స్వాహాచేసిన ఉద్యోగినికి తిరిగి ఉద్యోగం ఇచ్చారు. మదనపల్లె బ్రాంచ్‌లో రూ.2.20 కోట్లు ఒకే కుటుంబ సభ్యుల ఇంటికి ఇచ్చారు. ఇదేవిధంగా వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు బ్రాంచ్‌ల్లో విపరీతంగా అక్రమ రుణాలకు పాల్పడి అర్హులైన రైతులకు కాకుండా, వైసీపీ కార్యకర్తలకు ఉపయోగపడడం జరిగింది. వరదయ్యపాళ్యం బ్రాంచ్‌లో రూ.1.50కోట్లు ఎస్‌హెచ్‌జీ లోన్ స్వాహా జరగ్గా, ఇప్పటి వరకు వారినుంచి ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదు. పుత్తూరు, నగరి, అన్నమయ్య, తిరుచానూరు బ్రాంచ్‌ల్లో పాలకవర్గ డైరెక్టర్లు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి రీపేమెంట్ కెపాసిటీ లేనివారికి కమీషన్ల కోసం రుణాలు మంజూరు చేసి నష్టం కల్గించారు. వీటన్నిటిపై నిజాలు నిగ్గుతేల్చి కఠిన చర్యలు తీసుకోవాలి' అని విచారణ అధికారిని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు కోరారు.

## మాట ప్రకారం ఉచిత సిలిండర్ల పంపిణీ : నాదెండ్ల



ఈశ్వరమ్మకు సిలిండర్ అందజేస్తున్న మంత్రి మనోహర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం దీపం-2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతి నగరం శ్రీకృష్ణదేవరాయల వీధిలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ప్రభుత్వ విప్ శ్రీధర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభంబన్సల్‌తో కలసి ఆయన శుక్రవారం రాత్రి లబ్ధిదారు డి.చిన్నఈశ్వరమ్మకు సిలిండర్ పంపిణీ చేసి మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీలో మొదటి, రెండు విడతలను తిరుపతి నుంచే ప్రారంభించినట్లు చెప్పారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సిలిండర్లు ఇస్తున్నామని, ఈ పథకం ద్వారా ప్రభుత్వంపై రూ.2,800 కోట్ల భారం పడుతోందని వెల్లడించారు. కొత్తగా రెండు లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, సివిల్ సప్లయిస్ డీఎం సుమతి, డీఎస్వో శేషగిరిరాజు, జనసేన జిల్లా, నగరాధ్యక్షులు పి.హరిప్రసాద్, రాజారెడ్డి, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భూగర్భ నీటిమట్టం పెంపునకు చర్యలు

రూ.150 కోట్లతో 'ఉపాధి' పనులు - కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భూగర్భ నీటిమట్టం పెంపునకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల ప్రగతిపై మీడియాకు వివరాలు తెలిపారు. 'ప్రస్తుత ఖరీఫ్ సీజన్ అనుసరించి జిల్లాలో 50శాతం కరువు ప్రాంతాలుగా గుర్తించడం జరిగింది. భూగర్భ జలవనరులు తగ్గడమే ఇందుకు కారణం. అందువల్ల కొత్త ఏడాదిలో 13వేల ఫారం పాండ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఒక్కో నిర్మాణానికి రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చవుతుంది. ఒక్క ఫారంపాండ్ నిర్మాణం ద్వారా లక్ష లీటర్ల నీటిని నిల్వ చేయడంతో భూగర్భ నీటిమట్టాన్ని పెంచుకోవచ్చు. గత ఏడాది 3,253 ఫారంపాండ్ల నిర్మాణాలు ప్రారంభించి 1,400 పూర్తిచేశాం. సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.79 కోట్ల విలువతో 1,605 పనులు చేపట్టగా, 1,326 పూర్తిచేశాం. రూ.25కోట్ల మేర బిల్లు చెల్లింపులు జరిగాయి. చిత్తూరు - వేలూరు, యాదమరి - చిత్తూరు సీసీ రోడ్డు పనులు, పలమనేరు నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, 25 పాఠశాలల ప్రహరీల పనులు పురోగతిలో ఉన్నాయి. 2025-26 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ.150 కోట్లతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నాం. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు పిల్లలకోసం ఒక క్రీడామైదానం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రూ.8లక్షలతో అనుమతులు మంజూరు చేశాం. అభివృద్ధి పనుల మంజూర్లలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల అభ్యర్థనను ముందస్తుగా పరిగణనలోకి తీసుకుంటాం. చెరువులకు నీరు చేరే ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి, వర్షాకాలంలో నీటి నిల్వ కార్యక్రమం చేపడతాం. ఎస్సీ, ఎస్టీ హేబిటేషన్లలో వందశాతం సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేసి చర్యలు తీసుకుంటున్నాం' అని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

# బావిలో పడ్డ జింక

రక్షించిన అటవీ శాఖాధికారులు



ఐరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఐరాల పంచాయతీ గోవిందరెడ్డిపల్లె సమీపంలో అటవీ ప్రాంతానికి దగ్గర్లోని ఏవీ రంజిత్‌రెడ్డి మామిడి తోటలో ఉన్న వ్యవసాయ బావిలో శుక్రవారం వేకువజామున ఓ జింక ప్రమాదవశాత్తూ పడిపోయింది. ఉదయం తోట యజమాని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఆర్వో రాకేష్ కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బావిలో పడిన జింకను బయటకు తీసి, అటవీప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రెడ్డిప్రసాద్, పద్మ, లావణ్య, నిశ్చల్‌బాబు పాల్గొన్నారు.

## తండ్రిని చంపిన కొడుకు అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన కొడుకును అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలంలోని పాపిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు మందడి(60)మద్యానికి బానిసై భార్య జ్యోతితో గొడవపడేవాడు. బుధవారం సాయంత్రం కూడా మద్యం మత్తులో భార్యతో గొడవ పడ్డాడు. అక్కడే ఉన్న కుమారుడు నాగరాజు మందడి దీన్ని తట్టుకోలేక తండ్రి తలపై ఇటుక రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడు అన్న సుబ్రహ్మణ్యం ఫిర్యాదుతో శుక్రవారం నిందితుడు నాగరాజును కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ సుమన్ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌కు క్యూకట్టిన బాధితులు

35 మందికి ప్రీ అప్రూవల్ ● వైసీపీ అడ్డగోలుతనంపై పలువురి ఆవేదన



టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌కు హాజరైన బాధితులు

తిరుపతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారి టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రారంభమైంది. దాదాపు వందమందికి పైగా బాధితులు క్యూ కట్టారు. ఇదివరకే 45 మందికి ప్రీ అప్రూవల్ ఇవ్వగా, ఇప్పుడు మరో 35 మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. ఒక్కో రోడ్డుకు సంబంధించి వేర్వేరుగా జాబితాలు తయారుచేసి దరఖాస్తులు స్వీకరించారు. భూతగాదాలున్న వాటిని మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పారు. తొలిరోజు ప్రారంభంలో స్పెషల్ డ్రైవ్ కాస్త గందరగోళంగా మొదలైంది. బాధితులకు సరైన సమాధానం, భరోసా ఇవ్వడంలో విఫలమైనట్టు కనిపించింది. కార్పొరేషన్‌కు గిఫ్ట్‌డీడ్ ఇచ్చినవాటికి టీడీఆర్ బాండ్లు ఇవ్వడం సాధ్యపడదని చెప్పడంతో కొందరు ఖంగుతిన్నారు. తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లతో గిఫ్ట్ డీడ్లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలింపచేశారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల వారీగా వివరాలు సేకరించారు. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన, వాలిడేషన్, రిజిస్ట్రేషన్ చేసే విధానంపై వివరించారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా మాస్టర్ ప్లాన్ రోడ్లువేసి, న్యాయం చేస్తామని నమ్మించి మోసం చేశారని ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఈ స్పెషల్ డ్రైవ్ వారం రోజులపాటు కొనసాగనుంది.

### పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన

టీడీఆర్ దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య మీడియాకు చెప్పారు. ఆ తర్వాత కమిటీ పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇస్తామని, తర్వాత గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో ఎక్కువ మంది నివాస యోగ్యమైన స్థలాలకు కమర్షియల్ డోర్ నంబర్‌తో రిజిస్టర్ చేశారన్నారు. అటువంటి వాటిని, సరైన ధ్రువ పత్రాలు జతపరచని వాటిని షార్ట్ ఫాల్ చేశామన్నారు. వీరందరూ సరైన ధ్రువపత్రాలతో వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. ఇదివరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 9 దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా ఒకదానికి మాత్రమే సరైనదిగా గుర్తించి, తక్కిన ఎనిమిదింటికి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకురావాలని షార్ట్‌ఫాల్ లిస్ట్‌లో పెట్టారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం పోగొట్టుకున్న ఆస్తులు: 1074
- ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు ఇచ్చినవి: 443
- ఇవ్వాల్సిన టీడీఆర్ బాండ్లు: 631
- పరిశీలనలో ఉన్న దరఖాస్తులు: 214
- టీడీఆర్ పోర్టల్‌లో అప్‌లోడైన ఆస్తులు: 412

## ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు



పట్టణంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మున్సిపల్ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో వివిధ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, సైన్‌బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రోడ్లు, డ్రైనేజీ కాల్వలపై ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మున్సిపల్ శాఖ నిబంధనలను వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా అర్జున తపస్మాన్



కల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సచివాలయం-3 సమీపంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ ఘట్టం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ద్రౌపది సమేత ధర్మరాజుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని తపస్మాన్ వద్దకు అర్జునుడి వేషధారి చేరుకుని, తపస్మాన్ ఒక్కో మెట్టు ఎక్కుతూ పాటలు ఆలపిస్తూ పైభాగానికి చేరుకున్నాడు. అర్జునుడి వేషధారి తనతో పాటు జోలెలో తీసుకెళ్లిన నిమ్మకాయలు, విభూది, పూలు, పండ్లను నలువైపులా వెదజల్లాడు. పవిత్రంగా భావించే నిమ్మకాయలు తింటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకంతో వీటిని అందుకునేందుకు ఎగబడ్డారు. ఉత్సవాన్ని తిలకించిన భక్తులు ద్రౌపదీ సమేత పాండవులను దర్శించుకుని తరించారు. అర్జున తపస్మాన్ ఘట్టంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అర్జున తపస్మాన్ ఘట్టం ఉభయదారులుగా కల్లూరుకి చెందిన బ్రహ్మయ్య ఆచారి, ఈశ్వర్ ఆచారి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

## రేపట్నుంచి రాయలపేటలో శ్రీరామనవమి ఉత్సవాలు

పెద్దపంజాణి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం రాయలపేట కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి శ్రీరామనవమి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 6వతేది ఆదివారం కోదండరామస్వామికి అభిషేకంతో ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. రాత్రి స్వామివారిని హంస వాహనంపై ఊరేగిస్తారు. 7న ఉదయం అభిషేకం, రాత్రి హనుమంత వాహనం, 8న అంజనేయ వాహనం, 9న సింహ వాహనం, 10న గరుడ వాహనసేవ, 11న పగలు సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి మంటపోత్సవం, 12న రథోత్సవం, 13న యాళి వాహనం, 14న శేష వాహనం, 15న ఉట్లు తిరుణాళ్ల, 16వ తేది బుధవారం పగలు వసంతోత్సవం, రాత్రి శయనోత్సవంతో కోదండరామస్వామి ఉత్సవాలు ముగుస్తాయి.

## ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులకు 'కేఈసీ' ఆర్థిక సాయం



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు చెక్కులు అందజేస్తున్న కేఈసీ చైర్మన్ బీసీ నాగరాజ్, సునీల్‌రాజ్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (కేఈసీ)లో ఈసీఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పి.లోకేశ్, ఎస్.డి.చందులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరి వైద్య ఖర్చులకోసం కుటుంబ సభ్యులు ఇప్పటికే సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశారు. గాయపడ్డ విద్యార్థులను ఆదుకోవడానికి కేఈసీ విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం కలిసి రూ.1,70,225 విరాళంగా సేకరించారు. ఇందులో లోకేశ్‌కు రూ.1,00,150, చందుకు రూ.70,105 ఆర్థిక సాయం చేశారు. ఈ నగదు చెక్కులను కళాశాలలో శుక్రవారం కేఈసీ చైర్మన్ బీసీ నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్‌లు విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ జీఎన్.కోదండరామయ్య, విభాగాధిపతులు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బోయకొండ గంగమ్మకు శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ కు శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో వేదపండితులు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## 7న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- హాజరుకానున్న కలెక్టర్

పలమనేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఈనెల 7న జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆర్డీవో పి.భవాని తెలిపారు. ప్రజలనుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలమనేరు డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కలెక్టర్ సుమిత్‌కుమార్ వస్తున్న నేపథ్యంలో అధికారులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయ పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి చదును చేస్తున్నారు.

## ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న ఆరీఫ్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో ఇద్దరు గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.... పట్టణానికి చెందిన అజ్మతుల్లా కుమారుడు ఆరీఫ్ (52)కు నక్కబండ మార్గంలో భూమి ఉంది. నక్కబండకు చెందిన సయ్యద్‌అహ్మద్ కుమారులు సద్దాం(34), రఫీ(34)లు కలసి కొంత స్థలాన్ని ఆరీఫ్ వద్ద కొనుగోలు చేశారు. ఆ భూమిలో 4 అడుగుల స్థలంలో సీసీ రోడ్డు వేయడంతో సద్దాం, రఫీలు ఆ స్థలం కోసం ఆరీఫ్‌తో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఆరీఫ్ తలకు గాయాలయ్యాయి. అతడిని కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సద్దాంకు స్వల్ప గాయాలు కావడంతో అతడు కూడా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## మోడల్ పాఠశాలకు రూ.3.75లక్షలు మంజూరు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవినాథునికుంట గ్రామంలోని మోడల్ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ నిధుల నుంచి రూ.3.75లక్షలు నిధులు మంజూరు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పాఠశాల మెస్ నిర్వహణకు రూ.1.25లక్షలు, గ్రాండ్ కాంపోనెంట్ కింద రూ.2లక్షలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహణకు రూ.లక్ష, వంట సామగ్రి కొనుగోలుకు రూ.50వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.

## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

పలమనేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని ఏవో సంధ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రూ.9 లక్షల విలువ చేసే వ్యవసాయ పనిముట్లను 50 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో ఎస్సీ రైతులకు 17 శాతం, ఎస్టీ రైతులకు 8 శాతం కేటాయించారని తెలిపారు. ఈ పథకాన్ని పొందేందుకు ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు అర్హులన్నారు. గత 5 సంవత్సరాల్లో వ్యవసాయ యంత్రీకరణ సబ్సిడీ ఉపయోగించుకోని రైతులు అర్హులన్నారు. ఈ పంటలో నమోదుచేసుకొన్న రైతులు ఇందుకు అర్హులని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే రైతులు ఐదెకరాల లోపు భూమి కలిగి ఉండాలని, ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చౌడేపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. దుర్గసముద్రం పంచాయతీ కేతనపల్లెకు చెందిన ఓ మహిళను శుక్రవారం అరెస్టు చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## 7నుంచి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు

సోమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వతేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమవుతాయని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గంగాధరం నాయుడు తెలిపారు. 1వ తేదీ నుంచి సీనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఎంబైపీసీ గ్రూప్‌ను కొత్తగా ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థినులకు ఎంపీహెచ్‌డబ్ల్యూ (నర్సింగ్) కోర్సుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. అదనంగా ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందన్నారు. గ్రామీణ పేద, మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.




పలమనేరులో నిరుపయోగంగా ఉన్న రైతుబజార్ - వాణిజ్య సముదాయంలో తెరుచుకోని గదులు

# నిరుపయోగంగా రైతుబజార్

- రూ.26 లక్షల ప్రజాధనం వృథా



గతనెల 9న రైతుబజార్ ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి (ఫైల్‌ఫొటో)

పలమనేరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పలమనేరు వారపు సంత వద్ద నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. పలమనేరులో రైతుబజార్ ఏర్పాటు చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని, చిన్న రైతులు తాము పండించిన కూరగాయలను, వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తే గిట్టుబాటుధర ఉంటుందని గత ప్రభుత్వ హయాంలో మార్కెటింగ్ శాఖ అధికారులు భావించారు. దీంతో మున్సిపల్ వారపు సంత జరిగే ప్రాంతంలో స్థలాన్ని ఎంపిక చేసి రూ.26 లక్షల వ్యయంతో రైతుబజార్ నిర్మాణం చేపట్టి, కొంతమేర నిర్మించి మిగిలిన పనిని విడిచిపెట్టారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇక్కడ రైతులు తమ కూరగాయలను అధికారులు విక్రయించుకునేందుకు ఒకషెడ్‌తో పాటు వాణిజ్య సముదాయాన్ని కూడా నిర్మించారు. ఈ రైతుబజార్‌ను గత నెల 9వ తేదీన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత ఒక్కరైతు కూడా ఈ రైతుబజార్ వైపు కన్నెత్తి చూడక పోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. పలమనేరు మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగాను, గంగమ్మగుడివీధిలో శివాలయం పరిసరాల్లో ఉన్న చిన్న వ్యాపారులను మున్సిపల్ అధికారులు వారపు సంత జరిగే స్థలంలోకి తరలించారు. అయితే కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లను మాత్రం తరలించలేదు. పలమనేరు సూపర్‌బజార్ సమీపంలోనూ, గంగమ్మతోపు వద్ద, మారెమ్మగుడి వీధిలోనూ చిరు కూరగాయల వ్యాపారులు ఇప్పటికీ తమ వ్యాపారాలు చేసుకొంటున్నారు. వారిని మాత్రం అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగించలేదు. అదేవిధంగా జాతీయ రహదారిలో మార్కెట్‌కమిటీకి ఎదురుగా హైవే స్థలాలను ఆక్రమించుకొని కూరగాయల వ్యాపారం చేస్తున్న వారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో నేడు వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారాలు లేక ప్రజలు రాక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపు సంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతో పాటు లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైతుబజార్‌లో రైతులు కూరగాయలు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇక్కడి చిరు వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ డీటీ సుధారాణి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీటీ సుధారాణి సూచించారు. శుక్రవారం సాయంత్రం పుంగనూరు మండలంలోని ముడిపాపనపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, రోగుల రిజిష్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఓపీ పెంచాలని, కాన్పులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోందని మండిపడ్డారు. మహిళలకు అన్ని పరీక్షలు ఇక్కడే చేయాలని ఆదేశించారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట డాక్టర్లు ప్రవీణ, నవీన్, తేజ్‌రాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపట్నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రామకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6న సాయంత్రం 6గంటలకు గణపతిపూజ, రక్షాబంధనం, అంకురార్పణ, కలశస్థాపన, హోమాలు నిర్వహించిన అనంతరం రాత్రి నందివాహన సేవ జరుగుతుందన్నారు. 7న భూతవాహన సేవ, 8న సింహవాహన సేవ, 9న నెమలి వాహన సేవ, 10న హంస వాహన సేవ, 11న రాత్రి గిరిజా కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న రాత్రి పార్వేటోత్సవం, రావణబ్రహ్మవాహనసేవ, 14న వసంతోత్సవం, 15న ద్వాదశ హారతులు, శయనోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 16న రాత్రి విఘ్నేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి, గంగమ్మ, సల్లాపురెమ్మల పుష్పపల్లకీ సేవలు జరుగుతాయన్నారు. పుష్పపల్లకీ సేవ సందర్భంగా తమిళనాడు సాంస్కృతిక నృత్యాలు, పాట కచేరీలు ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. 6న సాయంత్రం బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ కళాకారులచే భక్తి నృత్య ప్రదర్శన, 10న రాత్రి కర్ణాటక కళాకారులచే వీరభద్ర నృత్యప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆలయం వద్ద సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనల ఆలాపన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదయోగ్యమే: బీజేపీ

పుంగనూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికార, విపక్షాల మధ్య లోక్‌సభ, రాజ్యసభలో చర్చించి వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ముస్లిం మహిళలు, పేదలు, యువత వక్ఫ్ బోర్డు ద్వారా ఆస్తులను కోల్పోకుండా న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల పరిధిలోని గుత్తార్లపల్లె విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలదాకా మూడు గంటలపాటు కుప్పం పట్టణ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని రెస్కో ప్రాజెక్ట్ ఇంజనీరు సీఎం ప్రభాకర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



సోమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆశాఖ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మురళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం తెలిపారు. సోమల వారపు సంతలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఎర్రబల్లి రవి, ఉపాధ్యక్షుడిగా కాగతి కృష్ణయ్య, కార్యదర్శిగా బీర్ని రవి తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పి.ప్రకాశ్, సుభాకర్, సురేంద్ర, హరికృష్ణ, గోవిందు, రెడ్డెప్ప, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రబోధానంద జన్మదిన వేడుకలకు బయల్దేరిన భక్తులు



కుప్పం నుంచి బయల్దేరిన భక్తులు

కుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో సమీపంలోని పొడమల గ్రామంలో గల శ్రీకృష్ణ మందిరంలో ఈనెల 5వ తేదీన జరుగనున్న త్రైత సిద్ధాంత ఆదికర్త, ఇందూ జ్ఞాన ధర్మ ప్రదాత ఆచార్య ప్రబోధానంద జన్మదిన వేడుకల కోసం కుప్పంనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో శుక్రవారం బయల్దేరివెళ్లారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కుప్పం, శివరాంపురం అధ్యక్షులు కృష్ణ, కృష్ణమూర్తి, సభ్యులు తదితరుల ఆధ్వర్యంలో వారు పయనమయ్యారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలి

పుంగనూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిన బీజేపీ, ఆ పార్టీకి మద్దతుగా నిలుస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పడానికి ముస్లింలు సిద్ధంగా ఉన్నట్లు ముస్లిం, మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరులో వారు మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ముస్లింలను దెబ్బతీయడానికే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్ల కోసం తప్పుడు హామీలు చెప్పి నమ్మించి ఓట్లు వేసుకుని అధికారంలోకి రాగానే ముస్లింలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. ముస్లిం, మైనార్టీ సోదరులు రాజకీయ పార్టీలను పక్కన పెట్టి ఐకమత్యంతో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పుంగనూరు అంజుమాన్‌కమిటీ అధ్యక్షుడు ఎంఎ.స్.సలీం, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, మైనార్టీ నాయకులు ఫక్రుద్దీన్ షరీఫ్, అమ్ము, ఎస్.ఖాదర్‌బాషా, ఖిజర్‌ఖాన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ ముందస్తు జయంతి వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, వివిధ రంగాల్లో ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- డీసీసీ అధ్యక్షుడు భాస్కర్

వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ విమర్శించారు. ఈ బిల్లును చూస్తుంటే రాజ్యాంగంలోని నిబంధనలను నీరుగార్చేలా, మైనార్టీలను కించపరిచేలా ఉందని శుక్రవారం వెదురుకుప్పంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం నేర్పుతారని అన్నారు.

## మహిళల రక్షణ కోసమే శక్తి యాప్: డీఎస్పీ



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ విజయశేఖర్ తదితరులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే శక్తి యాప్ రూపొందించడం జరిగిందని మహిళా డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద గ్రామంలోని శ్రీవిజ్ఞానతేజ స్కూల్‌లో శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాద పరిస్థితుల్లో శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజనీ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు నాగసౌజన్య, మునీషా, పాఠశాల నిర్వాహకులు కుమార్, నవమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ సీజ్: ముగ్గురి అరెస్టు



సీజ్‌చేసిన ఇసుక లారీ

గుడిపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా వెళ్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు శుక్రవారం ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. గొల్లమడుగు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. చిత్తూరు మురకంబట్టు నుంచి ఎటువంటి అనుమతులు, రసీదు లేకుండా తమిళనాడుకు ఇసుక తరలిస్తుండగా లారీని పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన డ్రైవర్ రాజ, క్లీనర్ రాము, లారీ ఓనర్ పార్థిబాను అరెస్టు చేశారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల సీజ్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీకే కండ్రిగలోని చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతోపాటు ఓ ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సీజ్ చేశారు. స్థానికుల సమాచారంతో తనిఖీలు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## మహిళలను మహారాణులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ ప్రసాదరావు



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలను మహారాణులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఢిల్లీ పార్లమెంటులో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఆయన శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో పొదుపు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, ఉపాధి అవకాశాలు, దేశాభివృద్ధిలో సంఘాల పాత్ర తదితర అంశాలపై కేంద్ర, పట్టణ వ్యవహారాల మంత్రి తోహన్ సాహును అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు మానసపుత్రికగా పేర్కొనే స్వయం సహాయక పొదుపు సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. చంద్రబాబు కలలను సాకారం చేసేదిశగా కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరపడంపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

### మహిళల రక్షణ కోసమే శక్తి యాప్: డీఎస్పీ



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ విజయశేఖర్ తదితరులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే శక్తి యాప్ రూపొందించడం జరిగిందని మహిళా డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద గ్రామంలోని శ్రీవిజ్ఞానతేజ స్కూల్‌లో శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాద పరిస్థితుల్లో శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజనీ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు నాగసౌజన్య, మునీషా, పాఠశాల నిర్వాహకులు కుమార్, నవమణి తదితరులు పాల్గొన్నారు.

### మహాభారత ఉత్సవాలు ప్రారంభం



పెనుమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శాతంబాకం పంచాయతీలోని వడ్డిగుడిసెలు సమీపంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్చకులు పూజలు నిర్వహించి, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఉభయదారులుగా పెద్దరాజుపల్లెకు చెందిన విజయమ్మ, దేవరాజులు దంపతులు వ్యవహరించారు. కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ జయచంద్రారెడ్డి, రాజారెడ్డి, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.

### సజావుగా ఉత్సవాలు నిర్వహించాలి



ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల పరిధిలోని ద్రౌపది సమేత ధర్మరాజుల దేవాలయాల ఆవరణంలో ఏడాదికి ఒకసారి జరిగే మహాభారతం ఉత్సవాలను సజావుగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఆయా ఆలయాల కార్యనిర్వాహకులను పిలిపించి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

### శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



స్వామివార్లకు ఊంజల్ సేవ

వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో ఉన్న సీతాకోదండరాములస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవాలు శాస్త్రోక్తంగా మొదలయ్యాయి. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామివార్ల ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి, ఊంజల్ మండపానికి తీసుకొచ్చారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లను ఊరేగించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేదపండితులు, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### కృష్ణావతారంలో మహావిష్ణువు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సీటీ రోడ్డు వీరాంజనేయ స్వామి ఆలయలో శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహావిష్ణువును కృష్ణావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలంకార ఉభయదారులు, అర్చకులు, నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయ కుంభాభిషేకం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాలేరు పంచాయతీ జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన షిరిడి సాయిబాబా ఆలయ కుంభాభిషేకం నిర్వాహకుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు గణేష్‌గురుకుల్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, సునీల్ కుమార్, లలితకుమారి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, పాలేరు సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

### వైభవంగా విష్వక్సేనుడి ఉత్సవం



ఆలయంలో ఊరేగుతున్న విష్వక్సేనుడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోదండరామలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు నాందిగా విష్వక్సేనుడి ఉత్సవం, తిరుమంజనం నిర్వహించారు. రామానుజ ట్రస్టు చిత్తూరు, ఆలయ మాజీ పాలక మండలి చైర్‌పర్సన్ కె.సుగుణ, బద్రీనాథ్ ఉభయంతో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ అర్చక బృందం, వేద పండితులు గర్భాలయం చుట్టూ 101 ప్రదక్షిణలు చేస్తూ వేద పారాయణం చేశారు. ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అబ్బర్వర్ చెంగల్ రాయలు, మెసెంజర్ రవి, సిబ్బంది రెడ్డెప్ప, శీను, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం ధ్వజారోహణం, సప్త ఉత్సవం, సింహ వాహన సేవ జరగనుంది.



## నెల రోజులుగా ఏటీఎం మూత

### ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, కలెక్టరేట్‌కు వచ్చే జనం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎం నెల రోజులుగా పనిచేయడం లేదు. దాంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులతో పాటు ఇక్కడికొచ్చే జనం.. కలెక్టరేట్ నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న గిరింపేట ఏటీఎంకు వెళుతున్నారు. ఇకనైనా బ్యాంకు అధికారులు ఈ ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## కామధేను వాహనంపై అగస్త్యేశ్వరుడి చిద్విలాసం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం శ్రీకలెక్షన్స్ బద్రీనాథ్, లక్ష్మి విష్ణుభవన్ రంగనాథంశెట్టి, పోతన, సూర్యప్రకాష్‌ల ఉభయంతో స్వామి అమ్మవార్లకు కేడయ (కేడిగ) ఉత్సవాన్ని ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు, ఈవో వెంకటేశ్వర్లు నిర్వహించారు. సాయంత్రం దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని వడ్లమండి సత్రం ఈవో సుబ్రహ్మణ్యంనాయుడు, సత్రం ఇన్‌స్పెక్టర్, అబ్బర్వర్ చెంగల్‌రాయల ఉభయంతో స్వామివారిని కామధేను వాహనం అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. టవల్ చంద్రశేఖర్, కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్, భక్తులు పాల్గొన్నారు.





కేడయ ఉత్సవంలో ఉభయదారులు, నిర్వాహకులు - కామధేను వాహనంపై అగస్త్యేశ్వర స్వామి

### ఇలాగైతే రోగాలు రావా..?



గుడిపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మరకాలకుప్పం పంచాయతీ నాగేంద్రపురం గ్రామంలో తాగునీటి కొళాయి చుట్టూ మురుగు చేరింది. అక్కడే తాగునీటిని పట్టుకోవడం వల్ల వ్యాధులొస్తాయేమోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### చంద్రప్రభ వాహనంపై కరకంఠేశ్వరుడి విహారం



నగరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారిని మాడవీధుల్లో సాయంత్రం ఏడు గంటలకు ఊరేగించగా, భక్తులు కర్పూర హారతులు పట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు.

### కొల్లాపూరియమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సదకుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన కొల్లాపూరియమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ హాజరై, అమ్మవారికి పూజలు చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జీ ఎస్పీ ధరణి, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బోయకొండ గంగమ్మకు రాహుకాల పూజలు

చౌడేపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మకు శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో వేదపండితులు అభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

### గ్రామాల్లో తాగునీటి సమస్య రాకూడదు

పాలసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ స్థాయి అధికారులు చూసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. సమస్య ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని అందించాలన్నారు. తాగునీటి పైపుల నుంచి నీరు వృథా కాకుండా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం: డీసీసీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ విమర్శించారు. ఈ బిల్లును చూస్తుంటే రాజ్యాంగంలోని నిబంధనలను నీరుగార్చేలా, మైనార్టీలను కించపరిచేలా ఉందని శుక్రవారం వెదురుకుప్పంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం నేర్పుతారని పేర్కొన్నారు.

నిరసన తెలిపిన ముస్లింలు

**చిత్తూరు రూరల్:** వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం చిత్తూరు సంతపేట పెద్ద దర్గా వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ.. లౌకిక విలువలను, మైనారిటీ హక్కులను హరిస్తున్న బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు షౌకత్, రషీద్, నాయకులు బాబు బాయ్, గౌస్, సద్దాం పాల్గొన్నారు.

### కోళ్లఫారాల్లో తనిఖీలు



కోళ్ల ఫారం వద్ద గోవిందయ్య తదితరులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మెదవాడ పంచాయతీ మర్రిపల్లె సమీపంలో ఉన్న కోళ్లఫారాలను పశుసంవర్ధక శాఖ పుత్తూరు డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ రూపసుందరి పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. కోళ్లకు బర్డ్ ఫ్లూ రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలని కోళ్లఫారం యజమానులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

### నాదెండ్లను కలసిన 'మాల' కార్పొరేషన్ డైరెక్టర్



వెదురుకుప్పం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గన్నవరంలో మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న కలిశారు. ఆయనవెంట పెనుమూరు మండల జనసేన అధ్యక్షుడు పామూరు శ్రీనివాసులు ఉన్నారు.

### ఇసుక లారీ సీజ్: ముగ్గురి అరెస్టు



సీజ్ చేసిన ఇసుక లారీ

గుడిపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా వెళ్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు శుక్రవారం ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గొల్లమడుగు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. చిత్తూరు మురకంబట్టు నుంచి ఎటువంటి అనుమతులు, రసీదు లేకుండా తమిళనాడుకు ఇసుక తరలిస్తుండగా లారీని పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన డ్రైవర్ రాజ, క్లీనర్ రాము, లారీ ఓనర్ పార్థిబాను అరెస్టు చేశారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల సీజ్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీకే కండ్రిగలోని చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతోపాటు ఓ ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సీజ్ చేశారు. స్థానికుల సమాచారంతో తనిఖీలు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

### సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చౌడేపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ కేతనపల్లెకు చెందిన మహిళను శుక్రవారం అరెస్టు చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### విద్యార్థులకు చెప్పుల వితరణ



విజయపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ పూర్వ విద్యార్థి కిన్నెర దినేష్ శుక్రవారం చెప్పులు వితరణ చేశారు. మధ్యాహ్న సమయంలో పలువురు విద్యార్థులు చెప్పుల్లేకుండా వెళ్లడాన్ని గమనించి, అందించానని దాత తెలిపారు. హెచ్ఎం జ్ఞానప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

### పలమనేరులో 7న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● హాజరుకానున్న కలెక్టర్

పలమనేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఈనెల 7న జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆర్డీవో పి.భవాని తెలిపారు. ప్రజలనుంచి కలెక్టర్.. అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలమనేరు డివిజన్ పరిధిలోని అన్నిశాఖల అధికారులు పాల్గొంటారని, డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ రానుండటంతో ఆర్డీవో కార్యాలయ పరిసరాలను అధికారులు శుక్రవారం శుభ్రం చేశారు.

## చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ ఇలాగేనా?

### పంచాయతీ కార్యదర్శులపై డీపీవో ఆగ్రహం

విజయపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పన్నూరు దళితవాడ, జగన్నాథపురం చెత్త సేకరణ కేంద్రాలను డీపీవో సుధాకర్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. నిర్వహణ సక్రమంగా లేదని పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆలపాకం, క్షూరికాపురం సచివాలయాన్ని పరిశీలించారు. విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి.. అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగన్నాథపురం చెత్త సేకరణ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో సుధాకర్‌రావు

## సంక్షిప్తంగా..

### ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందుగా ఆస్తి పన్ను చెల్లించినవారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు చెల్లించి.. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నులను సచివాలయం, పురసేవా కేంద్రాల్లో చెల్లించవచ్చన్నారు.

### గుడిపాల పీహెచ్‌సీలో తనిఖీలు

గుడిపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఏ విధంగా చేపడుతున్నారనే విషయంపై ఆరాతీశారు. అనంతరం 47 మందికి ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారు. వైద్యాధికారి సంధ్య, సబ్ యూనిట్ అధికారి నారాయణ, శివ, విజయ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నీ ప్రారంభం



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెద్దతయ్యూరులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ పీఏ చంద్రశేఖర్, ఎస్ఐ సుమన్ శుక్రవారం ప్రారంభించారు. క్రికెట్ ఆర్గనైజర్స్ గల్లా రాజు, చిరంజీవి, పెద్ద తయ్యూరు యూత్ పాల్గొన్నారు.

### వైభవంగా కల్యాణోత్సవం

గుడిపాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కందగిరి కొండలో వెలసి ఉన్న వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త సి.సుబ్రహ్మణ్యం నాయుడు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఊరేగించారు.

### స్వామిత్వ సర్వేపై పరిశీలన

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాతవెంకటాపురం పంచాయతీ గరిగెలపల్లెలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను శుక్రవారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడారు. డ్రోన్ టెక్నాలజీతో ప్రతి ఇల్లూ మ్యాపింగ్‌చేయడం జరుగుతుందని చెప్పారు. దీనివల్ల భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు వాటి ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు పొందడానికి వీలవుతుందన్నారు.

### సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులకు ఏవో చిట్టిబాబు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అంబికా గాంధీ, విస్తరణాధికారి సాదరయ్య, విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం రవి, రూత్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

### అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

#### వైసీపీ శ్రేణులకు 'స్వామి' భరోసా

శ్రీరంగరాజపురం/గంగాధర నెల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అధైర్య పడకండి.. అండగా ఉంటానని వైసీపీ శ్రేణులకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఎస్ఆర్‌పురం మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట, పెద్దతయ్యూరులో పర్యటించారు. గంగాధరనెల్లూరు మండలంలోని వేల్కూరు, కొట్రకోన, గోవిందరెడ్డిపల్లెలోనూ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### ప్రజలవైపే ఉంటాం: రోజా

విజయపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడులో అనారోగ్యం నుంచి కోలుకున్న సుధాకర్‌రాజును మాజీ మంత్రి రోజా శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలవైపే ఉంటామని చెప్పారు.